క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


కె.రాజకిశోర్, తహసీల్దార్

మొగల్తూరు: ఈ నెల 5న నిర్వహించే ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలో సుమారు 87 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా వీరిలో మహిళలు 21 మంది, పురుష ఉపాధ్యాయులు 66 మంది ఉన్నారన్నారు. మొగల్తూరు పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలోని 116వ పోలింగ్ స్టేషన్‌లో ఓట్లు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకు జరిగే పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. సిబ్బందిని కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు.

ఏకగ్రీవంగా ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఎన్నిక


ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న ఫొటోగ్రాఫర్స్

మొగల్తూరు: మొగల్తూరు ఏరియా ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ సభ్యులు మంగళవారం ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమావేశంలో ఎన్నికలను నిర్వహించారు. సమావేశానికి హాజరైన గౌరవ అధ్యక్షుడు డీవీవీ సుబ్రహ్మణ్యం, జి.డేవిడ్‌లు ఎన్నికైన సభ్యులను ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా వంకాయల రవికుమార్, కార్యదర్శిగా బి.మురళి, ఉపాధ్యక్షుడిగా వి.విశ్వనాథం, సహాయ కార్యదర్శిగా పి.సురేంద్ర, కోశాధికారిగా కె రామారావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి అన్ని విధాలా చేస్తామన్నారు.

వాసవీక్లబ్ అధ్యక్షుడిగా నూలి శ్రీనివాస్


వాసవీక్లబ్ నూతన కార్యవర్గం

నరసాపురం: వాసవీ క్లబ్ నరసాపురంశాఖ నూతన అధ్యక్షుడిగా 2025 సంవత్సరానికి సంబంధించి బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటీ అండ్ కరస్పాండ్ నూలి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అప్పన ప్లాజాలో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కంలచర్ల మురళీకృష్ణబాజ్జీ, ట్రెజరర్‌గా కోట్ల బాలకృష్ణ, అప్పన బదిరీసుబ్బారావును, జోన్ చైర్మన్‌గా, మండ రాజాను డీపీఓగా నియమించారు. జనవరిలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుంది. క్లబ్ ప్రతినిధులు దేవత వెంకటసుబ్బారావు, కనగళ్ల సత్యవెంకటసుబ్బారావు, జల్లూరి శ్రీనివాస్, శిరం సురేష్, సమయమంతుల సత్యనారాయణ పాల్గొన్నారు.

కళాకారుడు మానాపురానికి సత్కారం


ఛత్తీస్‌గఢ్ భిలాయ్‌లో సత్యనారాయణను సత్కరిస్తున్న నాట్య మండలి సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ కళాకారుడు పాలకొల్లు కళాపరిషత్ వ్యవస్థాపకుడు మానాపురం సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. మంగళవారం మానాపురం సత్యనారాయణ మాట్లాడుతూ ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో భిలాయ్‌లో ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి నాటికల పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించానని, గత మూడేళ్లుగా వరుసగా తనను ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా నియమించిన సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ నుంచి ఈ సత్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

లోపాలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

భీమవరం: ధాన్యం కొనుగోళ్లలో ఏ విధమైన లోటుపాట్లు లేకుండా త్వరితగతన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జిల్లాలోని రెవెన్యూ సిబ్బందితో ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 248 రైతు సేవా కేంద్రాల ద్వారా 1.72 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశామని, దీనికి సంబంధించి ఉండగా రూ.383 కోట్లు రైతులు ఖాతాల్లో జమ చేశామని అన్నారు. ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని మండల స్థాయి అధికారులు ఆదేశించారు.

ఆయాలకు జీతాలు అందేనా?

ఐదు నెలలుగా జీతాలు అందక అవస్థలు


పెనుగొండ ఆర్.తోటలో విధులు నిర్వహిస్తున్న ఆయా


చెరుకువాడ పాఠశాలలో బాత్రూమ్ వద్ద ఫ్లోర్‌ను శుభ్రపరుస్తున్న ఆయా

పెనుగొండ: అష్టకష్టాలు పడి అరకొర జీతాలతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా విధులు నిర్వహిస్తున్న వారికి జీతాలు ఎప్పుడు అందుతాయో? తెలియక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం ఆరు వేల రూపాయలకే ఉదయం నుంచి సాయంత్రం వరక శ్రమించి విధులు నిర్వహిస్తున్నా ఐదు నెలలుగా జీతాలు అందించడం లేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వా జూన్ వరకూ మాత్రమే జీతాలు చెల్లించడంతో కుటుంబ జీవనం ముందుకు సాగక వెతలకు గురవుతున్నారు. ఆయాలుగా ఉదయం 8 గంటలకే పాఠశాలకు హాజరై, సాయంత్రం 5 గంటల వరకూ పాఠశాలలోనే గడపుతున్నారు. వీరు ఉదయం 8 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు, తిరిగి సాయంత్రం 3 గంటలకు టాయిలెట్స్ శుభ్రపరచడంతో పాటు, పాఠశాలను శుభ్రం చేయడం, మధ్యాహ్న భోజనం అనంతరం శుభ్ర పరచడం వంటి విధులు నిర్వహించడానికి సైతం వీరినే వినియోగిస్తున్నారు.

300 మందికి ఒక్కరే ఆయా

నిబంధనలతో ఆయాల శ్రమను దోచేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా ఉన్నాయి. ప్రతి 100 మందికి ఓ ఆయాను నియమించాలన్న డిమాండ్ ఉన్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. ఇదిలా ఉండగా పాఠశాలలో ఇతర పనులకూ కొందరు వీరినే ఉపయోగిస్తుండడంలో కష్టంగా మారిందంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలో పెనుమంట్ర మండలంలో 53 మంది, పెనుగొండ మండలంలో 63 మంది, పోడూరు మండలంలో 74 మంది, ఆచంట మండలంలో 72 మంది విదులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలో మరింత మంది ఆయాలను నియమించడంతో పాటు, ప్రతీ నెలా జీతాలు సక్రమంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి నెలా జీతాలు చెల్లించాలి



ప్రతి నెలా జీతం అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. జూలై నెల నుంచి జీతం అందాల్సి ఉంది. బిల్లు మంజూరు అయ్యాయి...ఇచ్చేస్తామంటున్నారు. కానీ ఇవ్వడం లేదు. ప్రతి నెలా విధిగా మా జీతాలు అందించి ఆదుకోవాలి.

– టి.దుర్గ, జాంపేట

అన్ని విధులూ నిర్వహిస్తున్నాం



పాఠశాలలో అన్ని విధులూ నిర్వహిస్తున్నాం. కేవలం రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో జీతాలు పెంచి ఆయాలను ఆదుకోవాలి. జీతాలు ప్రతి నెలా సక్రమంగా అందించాలి.

– కమల కుమారి, వదలి

రూ.18 వేలు చెల్లించాలి



ఆయాల శ్రమను దోచేస్తున్నారు. కనీస వేతనం చెల్లించకుండా కేవలం రూ.6 వేలు మాత్రమే చెల్లించడం దారుణం. కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలి. ప్రతి నెలా జీతం చెల్లించడంతో పాటు ప్రతీ 100 మంది విద్యార్థులకు ఓ ఆయాను నియమించాలి.

– ఎస్.వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

బాలికల విద్యపై అవగాహన


ఏఎస్ఎన్ఎం కళాశాలలో శ్యామ్ సుందర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: కుటుంబంలో స్త్రీ విద్యావంతురాలైతే ఆ కుటుంబం అంతా విద్యావంతులే అవుతారని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి.శ్యామ్‌సుందర్ అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిక విభాగం తెలుగు, ఇంగ్లిష్, కంప్యూటర్ సైన్స్ వారి సహకారంతో నేషనల్ జెండర్ క్యాంపెయిన్ నయిచేతన్ 3.0లో భాగంగా బాలికల విద్యపై అవగాహనా సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు సమాజంలో చదువుతోపాటు, పౌష్టికాహారాన్ని అందించే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అలాగే నేటి సమాజంలో జరిగే అరాచకాలను దృష్టిలో పెట్టుకుని గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ భద్రాచలం, అధ్యాపకులు ఎన్.దినకరన్, జీడీ శ్రీనివాస్, సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.

సేవ్ వాటర్ సేవ్ లైఫ్‌పై అవగాహన

ఏఎస్ఎన్ఎం కళాశాలలో మంగళవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా సేవ్ వాటర్ సేవ్ లైఫ్ అనే అంశంపై అవగాహన కల్పించారు. నీటి సంరక్షణ ఉపయోగాలను వివరించారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలి


దివ్యాంగులకు ఆటల కిట్స్ అందిస్తున్న దృశ్యం


వదలి భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: దివ్యాంగుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ సభ్యుడు చల్లా దాన్యనాయుడు, యర్రంశెట్టి ఫణీకర్ సూచించారు. పట్టణంలోని శ్రీహరిపేట భవిత స్కూల్‌లో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ జాన్ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొని దివ్యాంగులకు అందుబాటులో ఉన్న చట్టాలను వివరించారు. దివ్యాంగులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. దివ్యాంగులకు ఆటల కిట్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సోమరాజు దుర్గాభవానీ, భవిత సెంటర్ నిర్వాహకురాలు శారద, ప్రధానోపాధ్యాయుడు దేవ రమేష్, పారాలీగల్ వలంటీర్లు ఎం.విజయకుమార్ పాల్గొన్నారు.

వదలిలో..

పెనుగొండ: దివ్యాంగులకు విద్యావకాశాలు, ప్రత్యేక హక్కులు ఉన్నాయని పెనుగొండ ఏపీఎస్ఆర్ ప్రిన్సిపాల్ ఎస్తేరు క్వీనీ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వదలి భవిత కేంద్రంలో దివ్యాంగులకు అందే ప్రోత్సాహకాలు, ప్రత్యేక పథకాలును వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.శుభాకరరావు, వదలి కాంప్లెక్స్ హెచ్ఎం బీఎల్ నరసింహమూర్తి, వి.అనంతనాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

పెనుమంట్ర: ఉపాధ్యాయులు దివ్యాంగుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మానవత సంస్థ మండల అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి అన్నారు. మండల మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆలమూరు భవిత దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగుల పట్ల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కనీస విద్య నైనా అందించడానికి కృషి చేయాలి అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి మానవత సంస్థ ఆర్థిక సహకారంతో బహుమతులు అందజేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ పేతురు లోకనాథ్ రెడ్డి, మానవత కార్యదర్శి శ్రీనివాస మురళీకృష్ణ, చదువు నరేంద్ర, కడలి సుబ్రహ్మణ్యం, బాణాల శ్రీనివాసరావు, పడాల జగన్నాథ రెడ్డి, చర్ల సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో డాక్టర్ బాలచందర్‌కు సత్కారం


దుబాయ్‌లో తెలుగు సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బాలచందర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: దుబాయ్ తెలుగు సంఘాలు ఆధ్వర్యంలో స్పందన ఈద ఫౌండేషన్ పెనుగొండకు చెందిన ప్రముఖ కవి రచయిత, ఎస్వీకేపీ పీవీ జూనియర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ బాలచందర్ సాదేను ఘనంగా సత్కరించారు. ఈ మేరకు మంగళవారం డాక్టర్ బాలచందర్ ఓ ప్రకటనలో విడుదల చేశారు. తనను ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ బాలచందర్‌ను కళాశాల పాలక వర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు, చెల్లుబోయిన భరత్, డాక్టర్ మత్తే జయ జీవితరాజు తదితరులు అభినందించారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


పీహెచ్‌సీ రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆకివీడు: మండలంలోని పెదకాపురంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులకుగాను ఒక వైద్యుడు మాత్రమే విధులు నిర్వర్తించడాన్ని ఆయన గుర్తించారు. ఆన్లైన్‌లో థంబ్ వేసి, అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయలేదని తహసీల్దార్ గుర్తించారు.

కిశోర వికాసంపై శిక్షణ


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పాలకొల్లు అర్బన్: ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో 11 నుంచి 18 సంవత్సరాల విద్యార్థినులతో కిశోర టీమ్‌లు ఏర్పాటు చేసి కిశోర వికాసంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిర అన్నారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కిశోర వికాసంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడుతూ విద్య, సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికాహారం, మానవుల ప్రాముఖ్యత, బాల్య వివాహాల నిరోధకం, బాలికల అక్రమ రవాణా, ఆత్మరక్షణ, పోక్స్ చట్టాలపై అవగాహన, మానసిక వికాసం, స్కిల్ డవలప్‌మెంట్, యోగ తదితర అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీఓ ఎన్ఎన్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కిశోర బాలికలకు వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేవిధంగా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ తాళ్ల మూర్తిబాబు, ఎంఈఓ ఆర్ఎస్‌పీఎస్ గంగాధర శర్మ, ఏఎస్సై ఎస్.మార్లింగం, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పులఖండం సత్యవేణి, కె.మల్లేశ్వరి, ఎం.మంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ వైద్య పరీక్షలు నిర్వహించాలి


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న రాష్ట్రీయ బాల సురక్ష జిల్లా కోఆర్డినేటర్ డా.భావన

పాలకొల్లు అర్బన్: ప్రతి విద్యార్థికీ ఆరోగ్యపరంగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్ చేయాలని రాష్ట్రీయ బాల సురక్ష జిల్లా కోఆర్డినేటర్ డా.భావన కోరారు. మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను డా.భావన పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలను బట్టి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్, ఆరోగ్యవిస్తరణాధికారి గుడాల హరిబాబు, ఏఎస్ఎన్ మూర్తి, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం జి.జనార్థన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల మూసివేత

ఆకివీడు: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 5న జరుగనున్న నేపథ్యంలో 48గంటల ముందుగా మూసివేసి డ్రైడేలుగా పాటిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సర్కిల్ పరిధిలో 23 మద్యం షాపులను మూసివేసి, సీలు వేశామన్నారు. ఐదో తేదీ సాయంత్రం నాలుగు గంటల తరువాత తెరుస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుమంట్ర: మార్టేరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం 8 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పెనుమంట్ర ఎలక్ట్రికల్ ఇన్చార్జ్ ఏఈ గూడూరు నాగరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మార్టేరు, నెగ్గపూడి, వెలగలేరు, సత్యవరం, కొల్లేటి పాడు, గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ లో కొత్త 5 ఎంవీ పవర్ ట్రాన్స్ఫర్మర్ ఏర్పాటు నిమిత్తం సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖాళీ స్థలాలు అనారోగ్యానికి నిలయాలు

- మునిసిపల్ రిజర్వ్ స్థలాలు అధ్వానం
- ప్రైవేట్ స్థలాలదీ అదే తీరు


12వ వార్డులో వర్షం నీటితో అధ్వానంగా ఉన్న స్థలం


18వ వార్డులో భవనాల మధ్య ఓ ప్రైవేటు స్థలంలో చెత్త, మొక్కలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ఖాళీ స్థలాలు అధ్వానంగా ఉండడంతో చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. పట్టణంలో ఉన్న 31 వార్డుల్లో సుమారు 75 వేల మంది జనాభా ఉన్నారు. ఇందులో ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని స్థలాలు కొనుగోలు చేసిన వారు కొందరైతే తమ స్థిరాస్తులుగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో కొందరు స్థలాలను కొనుగోలు చేసుకున్నారు. ఇళ్ల నిర్మాణం చేసుకోవాలనుకునే వారు ఇళ్లను నిర్మించుకుంటున్నారు. స్థిరాస్తుల కోసం కొనుగోలు చేసిన వారు మాత్రం స్థలాలు ఖాళీగా ఉంచుతున్నారు. ఇటువంటి స్థలాలతోనే స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ స్థలాల్లో చెత్త, చెదారం, మొక్కలు పెరిగిపోవడం అలాగే పక్క భవనంలో నివాసం ఉండే వ్యక్తులు చెత్తను ఆ ఖాళీ స్థలంలో వేయడంతో వ్యర్థాలు పెరిగిపోయి దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. అంతే కాకా ఆ స్థలాల్లో పందులు, కుక్కలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటి ప్రభావం వల్ల చుట్టు పక్కల స్థానికులు అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు.

1800 వరకు స్థలాలు

స్థలాల యజమానులు ఇక్కడ సైట్లను కొనుగోలు చేసుకుని దూరప్రాంతాల్లో ఉద్యోగాల రీత్యా స్థిరపడి ఉన్నారు. ఇలాంటి స్థలాలు పట్టణంలో సుమారు 1800 వరకూ ఉండవచ్చని మునిసిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజల ఆరోగ్యరీత్యా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. దీంతో కొన్ని చోట్ల స్థల యజమానులు శుభ్రం చేస్తున్నా కొన్ని కొన్ని చోట్ల పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు. కొన్ని స్థలాల్లో వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఆ నీరు పసర్లు చెంది ఉండడం అందులో పందులు స్వైర విహారం చేయడంతో దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు.

మునిసిపల్ రిజర్వ్ స్థలాలు మరింత అధ్వానం

ప్రజల స్థలాలు అలా ఉంచితే మునిసిపల్ రిజర్వ్ స్థలాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుంది. లే అవుట్లలో ఉన్న రిజర్వ్ స్థలాల్లో మురుగునీరు చేరి మొక్కలు పెరిగిపోయి అత్యంత దారుణంగా ఉన్నాయి. రిజర్వ్ స్థలాలు పట్టణంలో దాదాపుగా 120 వరకూ ఉన్నాయి. వీటికి చుట్టూ ఫెన్సింగ్ వేసి, స్థలాన్ని చదును చేసి శుభ్రం చేయాలి. దీనికి టెండర్లు పిలిచినా కొన్ని స్థలాలకే ఫెన్సింగ్ వేశారు అది కూడా అసంపూర్తిగానే వేయడంతో ఈ స్థలాలా అభివృద్ధి శూన్యంగానే కనిపిస్తుంది. ఈ మునిసిపల్ రిజర్వ్ స్థలాల్లో ఎవరి ఇష్టానుసారంగా వాళ్లు చెత్తను, శిథిలమైన ఇళ్ల రద్దును రాత్రి సమయాల్లో తీసుకువచ్చి ఈ స్థలాల్లో పడేస్తున్నారు. వీటి వల్ల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. దోమలతో పాటు విష సర్పాలు కూడా తోడవుతున్నాయి. అలాగే ముంగీసలు, పందికొక్కులు తయారయ్యి ఇంటి కింద తొలిచేయడంతో ఆ బొరియల్లో నీరు ఇంకిపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకుని రిజర్వు స్థలాలు శుభ్రం చేయాలని అలాగే ఖాళీ స్థలాల్లో మునిసిపల్ బోర్డులు ఏర్పాటుచేసి సంబంధిత యజమానుల ద్వారా శుభ్రం చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఖాళీ స్థలాలతో అనారోగ్యం



ఖాళీ స్థలాల వల్ల వాటిల్లో చెత్త పెరిగిపోయి నానా ఇబ్బందులకు గురవుతున్నాం. దోమలు, పాములు, విష పురుగులు ఇళ్లల్లోకి చేరిపోతున్నాయి. వీటికన్నా రోకలిబండలు, గాజు పురుగులు, ఏలిగపాములు గోడలపై పాకుతూ గదుల్లోకి సెల్ఫ్‌ల్లో ఉన్న దుస్తుల్లోకి, వంటగదుల్లోకి చేరిపోతున్నాయి. పోని స్థలాలను శుభ్రం చేయాలని స్థల యజమానులకు చెపుతుంటే మాపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మునిసిపల్ అధికారులే చర్యలు తీసుకోవాలి.

– నడింపల్లి సూరపరాజు, అధ్యాపకుడు, పాలకొల్లు

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



పట్టణంలో ఎక్కడైనా ఖాళీ స్థలాలు అధ్వానంగా ఉంటే మునిసిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి. వెంటనే స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి, స్థలాలను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. లేదంటే మునిసిపల్ యాక్ట్ సెక్షన్ 247 ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటాం. గతంలో పన్నులు కట్టడానికి లేదా భవన నిర్మాణం కోసం ప్లాన్‌కోసం వస్తే ఆ స్థల యజమాని ఎవరో తెలిసేది. ప్రస్తుతం అన్నీ ఆన్‌లైన్ పేమెంట్‌లు కారణంగా ఖాళీ స్థలాల యజమానులను గుర్తించలేకపోతున్నాం.

– రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పాలకొల్లు

బెల్ట్ షాపులపై దాడి

నరసాపురం రూరల్: నరసాపురం ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలోని మొగల్తూరులో బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రాంబాబు తెలిపారు. మంగళవారం మొగల్తూరు మండలంలోని పేరుపాలెం గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న అడబాల వెంకటేశ్వరరావు, మొగల్తూరులో మోటుపల్లి నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకుని వారిని మొగల్తూరు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో సీఐ రాంబాబుతోపాటు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్సై రమాదేవి, ఎస్సైలు ఖాసిం, జైన్ లబిన్ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుగొండలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తుల నుంచి 29 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. మంగళవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేయడంతో పాటు, వారి వద్ద నుంచి మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై బి.లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, వై.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.